

# ఏసీబీ వలలో అదనపు కలెక్టర్

**□ రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇంచార్జి విద్యాశాఖ అధికారి వెంకటరెడ్డి లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం కలెక్టరేట్‌లో సంచలనం సృష్టించింది. విద్యాశాఖకు సంబంధించిన వ్యవహారంలో రూ. 60 వేలు లంచం డిమాండ్ చేయడంతోపాటు జూనియర్ అసిస్టెంట్ ద్వారా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఏసీబీ అధికారులు వెంకటరెడ్డితో పాటు ఆయనకు సహకరించిన మరి కొంతమంది ఉద్యోగులను కూడా విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కలెక్టరేట్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు. – వరంగల్ వాయిస్, హనుమకొండ


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 005
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
డిసెంబర్ 05, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





# సమయం వృథా చేయకండి




వివరాలు 2లో..

చదువుకుంటేనే గుర్తింపు లభిస్తుందని, ప్రపంచాన్ని శాసించగలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన వారు రాజకీయాలవైపు కాకుండా పోటీ పడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. అప్పడే వారికి, వారి తల్లిదండ్రులకు గుర్తింపు లభిస్తుందన్నారు. నర్సంపేట పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొనడానికి శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 509 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తో పోటీ పడేలా వరంగల్ ను అభివృద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చారు. హైదరాబాద్ మాదిరిగానే వరంగల్ లో రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడంతోపాటు మార్చి లోగా ఎయిర్ పోర్ట్ పనులను ప్రారంభిస్తామంటూ ప్రకటించారు. ఇప్పటికే 61 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో మరో 40 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. - వరంగల్ వాయిస్, నర్సంపేట

- చదువుకుంటేనే గుర్తింపు
- 40 వేల ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్
- పోటీ పడి ఉద్యోగాలు సాధించండి
- రాజకీయాలు ఎప్పుడైనా చేయొచ్చు
- అందుకు కావాల్సిన వనరులు కల్పించే పూచీ మాది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## 12 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

- తక్షణమే రూ.25లక్షల నిధులు మంజూరు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతోనే ఏకగ్రీవాలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి




8లో..



8లో..

## మహిళా, శిశు అభ్యున్నతికి..

## కేంద్ర పథకాలు అత్యంత కీలకం

□ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




# సమయం వృథా చేయకండి





- 40 వేల ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్
- పోటీ పడి ఉద్యోగాలు సాధించండి
- రాజకీయాలు ఎప్పుడైనా చేయొచ్చు
- చదువుకుంటేనే గుర్తింపు
- అందుకు కావాల్సిన వనరులు కల్పించే పూచీ మాది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.509 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో భారీగా ఆస్తులు సంపాదించారు.. ఫాంహౌస్ లు కట్టుకున్నారు..విమానాలు కొన్నారు.. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. ఉద్యమగడ్డ అయిన వరంగల్ కు ఏమీ ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి అని ప్రకటిస్తే కాంగ్రెస్ సర్కార్ వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ వరికి ప్రోత్సాహకాలిస్తోందన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదన్నారు. రాష్ట్రంలో 1.10కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు.

### జయశంకర్ సార్ స్ఫూర్తిగా..

ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిగా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామన్నారు. ఆర్థిక భారం అనుకోకుండా పేదల ఆకలి తార్చాలనే ఉద్దేశంతోనే సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 61వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఒక కుటుంబానికి అన్నగా ప్రతి మహిళకు చీర, సారె ఇవ్వలన్న సంకల్పంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా చీరల పంపిణీ ఆగిపోయిందని, కోడ్ ముగియగానే 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు చీర అందేలా మంత్రులు కొండా సురేఖ, సీతక్క బాధ్యత తీసుకుంటారన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ చీరలు చేర్చే బాధ్యత సర్పంచులే తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడుతా..

తెలంగాణకు మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే ఢిల్లీని ఢీకొడతానంటూ ప్రకటించారు. తనకు వయస్సు ఉందని, ఓపిక ఉందని కేంద్రాన్ని నిలదీస్తానని వార్నింగ్ ఇచ్చారు. హైదరాబాద్ స్థాయిలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తానంటూ హామీ ఇచ్చారు. రేషన్ ఇవ్వాలంటే గజ్వేల్‌లో ఫాంహౌస్ రాసిచ్చినట్లుగా కేసీఆర్ ఫీలయ్యారని ఎద్దేవా చేశారు. ఏపీ కంటే అధికంగా వడ్లు పండించిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. ప్రపంచానికే పౌరుషాన్ని చాటిన వీరవనితలు సమ్మక్క – సారలమ్మ జాతరను పది కాలాల పాటు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏ ఊళ్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో అక్కడే బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి... మేము ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన దగ్గర ఓట్లు అడుగుతాం అన్నారు. తరతరాలుగా కుల వృత్తుల బతుకులు మార్చలేదు... చదువు ఒక్కటే పిల్లల భవిష్యత్తు మార్చుతుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన..


నర్సంపేట పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొనడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 509 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో భాగంగా రూ. 56.40 కోట్ల వ్యయంతో నర్సంపేట నుంచి నెక్కొండ హెచ్ఎం రోడ్డు 2ఎల్ +పీఎస్ నాలుగు లైన్ల రహదారి, రూ.82.56 కోట్లతో హనుమకొండ–నర్సంపేట–మహబూబాబాద్ హెచ్ఎం రోడ్డు నాలుగు లైన్లు, నర్సంపేటలో రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు, రూ.130 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహముల నిర్మాణ పనులు, రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులకు, నర్సంపేట పట్టణంలో రూ. 20.కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, రూ.17.28 కోట్ల వ్యయంతో నర్సంపేట నుంచి పాకాల హెచ్ఎం రోడ్డు 2ఎల్ ప్లస్ పీఎస్ లైన్ల పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





### ముఖ్యమంత్రికి ఘన స్వాగతం..

హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో నర్సంపేట పరిధిలోని బంజారా భవన్ వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి చేరుకోగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ప్రభుత్వ విప్ రామ చంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ తదితరులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాలతో సత్కరించారు.








# గ్రామాల్లో గులాబీ జెండా ఎగరాలి

**◆ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల :** రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామగ్రామాన గులాబీ జెండా (బీఆర్ఎస్) ఎగరాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలంతా ఏకమై, సైనికుడిలా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం పరకాల మండలం నాగారం గ్రామంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిస్తేనే గత రెండేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి మళ్లీ పుంజుకుంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత 420 బోగస్ హామీలను ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలకు తెలియచేయాలని, అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని గుర్తుచేయాలని కోరారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిందని, గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాయని వివరించారు. మహిళలకు రూ. 2500, రైతులకు బోనస్,



మద్దతు ధర, విద్యార్థినులకు స్కూటీలు, యువతకు ఉద్యోగాలు వంటి ఏ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని, ప్రతి రంగాన్ని నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందని, దీంతో గ్రామాల్లో సెక్రటరీలు సైతం తప్పించుకొని తిరిగే దుస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని, ఆ పార్టీకి వారు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ చేసిన అభివృద్ధే గ్రామాల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు చింతిరెడ్డి సాంబరెడ్డి, గురిజపల్లి ప్రకాష్ రావు, మునిగాల సురేందర్ రావు, గంట సమ్మిరెడ్డి, ఆముదాలపల్లి అశోక్, కోరే రమేష్, నడికూడ మండల సీనియర్ నాయకులు మేడిపల్లి శోభన్, సంగెం మాజీ ఎంపీపీ దొణికెల మల్లయ్య, మండల యూత్ నాయకులు, పది గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్ అభ్యర్థులు, వార్డు మెంబర్ అభ్యర్థులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ హైస్కూల్ విద్యార్థులకు డీఈఓ ప్రశంసలు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) కార్యక్రమంలో చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రశంసలు లభించాయి. కాకతీయ హైస్కూల్ విద్యార్థులు "సుస్థిర వ్యవసాయం" అనే అంశంపై తమ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయమే దేశానికి వెన్నెముక లాంటిదని, అటువంటి ముఖ్యమైన అంశంపై ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ తెలియజేశారు.

## క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 5 నుంచి 8 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో జరగబోయే పురుషుల కబడ్డీ అంతర్ జిల్లాల రాష్ట్ర ఛాంపియన్ షిప్‌లో పాల్గొనే జట్లకు శుక్రవారం హనుమకొండ కబడ్డీ స్టేడియంలో టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ సోద రామకృష్ణ ఆటగాళ్లకు టీ షర్ట్‌లు బహూకరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ.అజీజ్ ఖాన్, హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆకుల సారంగపాణి, కబడ్డీ వరంగల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ.అబ్దుల్లా ఖాన్, జాయింట్ సెక్రెటరీ బండారి ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, జాతీయ క్రీడాకారులు, కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అక్రమ్ ఖాన్, జాతీయ క్రీడాకారిణి పెనుకుల రజిత పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేస్తాం

**■ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నాయిని**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తామని, ఒక్క చుక్క నీరు కూడా నిలవకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని 54వ, 6వ డివిజన్లలో ఆయన సుమారు రూ.4.26 కోట్లతో మంచి నీటి పైప్ లైన్, సీసీ డ్రైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు నాలుగు కోట్ల రూపాయలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆయా కాలనీలలో నేరుగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిశీలించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. 54, 6వ డివిజన్‌లు తన 'సొంత డివిజన్'లుగా భావించి ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న అతి కొద్ది రోజుల్లోనే రూ. 1000 కోట్లతో మొదటి దశ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



చేయనున్నట్లు తెలిపారు. ఒక్క చుక్క నీరు కూడా నిలవకుండా ఉండేలా ప్రత్యేక కార్యాచరణతో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆనాడు పీసీసీ హోదాలో హనుమకొండ నగరానికి వచ్చిన రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలలో అన్నింటినీ నెరవేర్చే దిశగా పనులు చేపట్టారని అన్నారు. పోచమ్మకుంట శ్మశాన వాటిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టి సారించి, కిరాయి ఇళ్లలో ఉన్న కుటుంబాలకు మరణం భారం కాకుండా ఉండేందుకు ప్రత్యేక గదుల ఏర్పాటుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## కేయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ పదవీ కాలం పొడిగింపు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్)గా ఆచార్య రాజేందర్ కట్ల పదవీ కాలాన్ని మరో ఒక సంవత్సర కాలానికి పొడిగిస్తూ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ఆమోదంతో, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆచార్య రాజేందర్ కట్ల తన పదవిలో మరో సంవత్సరం పాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య రాజేందర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.

## కాంగ్రెస్ ప్రచారం షురూ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన వెంగళ విజయ్ శుక్రవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వెంగళ విజయ్ స్థానిక పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చందుపట్ల నరసింహారెడ్డి, పెరుమాండ్ల పరుశరాములు, వైనాల సాంబయ్య, చేరాల రోహిత్, మార్కెట్ డైరెక్టర్ జనగాని శివకృష్ణ, వైనాల వంశీ, వెంగళ సహదేవ్, దుబాయ్ శీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేయూ జువాలజీ బీఓఎస్ అధ్యక్షురాలిగా ప్రొఫెసర్ షమిత



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కేయూ జంతు శాస్త్ర విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షురాలిగా ఆచార్య జి.షమితా నియమితులయ్యారు. ఆచార్య షమితా ఈ పదవిలో రెండు సంవత్సరాల కాలానికి కొనసాగుతారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ఆమోదంతో, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య షమితా శుక్రవారం ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య ఈసం నారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య షమితాకు అభినందనలు తెలియజేశారు.

# డాక్టర్ అనితా రెడ్డికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ నివాసి అయిన డాక్టర్ కే.అనితా రెడ్డిని ఘనంగా సన్మానించారు. టస్ట్ సభ్యులు డాక్టర్ అనిత రెడ్డి నివాసంలో ఆమెను శాలువా, మొక్కతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ అనితా రెడ్డి దాదాపు 25 సంవత్సరాల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఆమె చిన్న పిల్లల పట్ల, వృద్ధుల పట్ల, అలాగే బధిరులు, దివ్యాంగుల పట్ల అందిస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకుని, ప్రోత్సాహకంలో భాగంగా ఈ సన్మానం చేసినట్లు తెలిపారు. సన్మానం స్వీకరించిన డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ట్రస్ట్ వారు సన్మానించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఈ సన్మానం తనను మరింత ప్రోత్సహిస్తూ, తన బాధ్యతను పెంపొందించినట్లుగా భావిస్తున్నానని తెలిపారు. ట్రస్ట్ వారు చేస్తున్న స్వచ్ఛంద కార్యక్రమాలను కూడా తాను వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలతో పాటు సంపాదన కూడా ఇచ్చి, ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, సభ్యులు సత్యనారాయణ, రాఘవ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 7న జర్నలిస్టులతో మాట–ముచ్చట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 'దీక్షా దివస్'ను పురస్కరించుకుని జర్నలిస్టులతో 'మాట–ముచ్చట' (మీట్ అండ్ గ్రీట్) కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌కు విచ్చేసి, జర్నలిస్టు మిత్రులను ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. జర్నలిస్టు మిత్రులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆత్మకూరు సర్పంచ్ అభ్యర్థిగా ఏరుకొండ రజని రవీందర్ గౌడ్ నామినేషన్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రజని రవీందర్ గౌడ్ ఆత్మకూరు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలపై పోరాడి, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ప్రతి ఒక్కరూ తనను దీవించి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు గ్రామ ప్రజలను కోరారు.

# శాయంపేట సర్పంచ్ బీజేపీ అభ్యర్థిగా బాసర విమల విద్యాసాగర్ నామినేషన్




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రానికి చెందిన బాసర విమల విద్యాసాగర్ శుక్రవారం నాడు బీజేపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో తాను వార్డు సభ్యుడిగా పని చేశానని, అందువల్ల గ్రామ సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలందరూ తనను దీవించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని, తద్వారా గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు ఇచ్చే బాధ్యత తనదని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఎరుకల అంజిరెడ్డి, వార్డు మెంబర్ల గెలుపు కోసం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఎరుకల అంజి రెడ్డికి ఉంగరం గుర్తుపై ఓటు వేసి, వార్డు మెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. "ప్రజలే మా పాలకులు, ప్రజల మేరకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది" అని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి ముసుగులో దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గెలిచి వచ్చిన వారి గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు ఇచ్చే బాధ్యత తనదనీ ఆయన హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అధికంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని, గత బీఆర్ఎస్ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆయన విమర్శించారు.

# విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించాలి



◆ సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** విద్యార్థులు పరీక్షల సమయంలో, సాధారణంగా కూడా మానసిక ఒత్తిడిని అధిగమించడం చాలా ముఖ్యమని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్ అన్నారు. శుక్రవారం మండలంలోని స్పెక్ట్రా హైస్కూల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తరపున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ప్రహసిత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలరని తెలిపారు. పరీక్షల సమయంలో ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుని చదవాలని, ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉండాలని సూచించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. పరీక్షలలో పాస్ అవుతామా, ఫెయిల్ అవుతామా అనే భయం లేకుండా పట్టుదలతో చదవాలని సూచించారు. ఎవరికైనా మానసిక ఆరోగ్య సమస్యలు ఉంటే, వాటిని ఇతరులకు చెప్పుకోవడానికి వెనకాడకూడదని సూచించారు. గంజాయి, కోకెన్, సిగరెట్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. చెడు వ్యసనాలకు బానిసలైన వారు, వాటి నుండి విముక్తి పొందడానికి 14416 టెలీమానాస్‌కి కాల్ చేసి తమ సమస్యను పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ప్రతి పాఠశాల వంద గజాల ఆవరణంలో ఎలాంటి పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రహసిత్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, వాటి నుంచి ఎలా బయటపడాలో తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెక్ట్రా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, మెడికల్ ఆఫీసర్ కె.స్పందన, సూపర్వైజర్ కె.సంపత్, సోషల్ వర్కర్ నరేష్, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులకు కావాల్సింది ప్రేమ, చేయూత



**వరంగల్ వాయిస్: హనుమకొండ :** మానసిక దివ్యాంగులకు ఇతరులతో సమానంగా అన్ని హక్కులు ఉంటాయని, ముఖ్యంగా వారికి కావాల్సింది ప్రేమ, చేయూత అని బీజేపీ సీనియర్ నాయకురాలు, జిల్లా అధ్యక్షులు రావు పద్మ, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండలోని స్పందన మానసిక వికాస కేంద్రంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల హక్కుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రావు పద్మ, ప్రత్యేక గౌరవ ఆత్మీయ అతిథిగా డాక్టర్ అనితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు అన్నీ హక్కులు ఉంటాయని, ముఖ్యంగా ఆస్తి హక్కు కూడా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, వారికి ప్రేమను పంచాలని కోరారు. వారి గుర్తింపు కార్డులు, పెన్షన్ కార్డుల ప్రక్రియను సులభతరం చేయాలని, మానసిక నిపుణులు వారిని సందర్శించి సేవలు అందించేలా సంబంధిత అధికారులను కోరుతామని హామీ ఇచ్చారు. మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఎలాంటి అవసరాలు ఉన్నా వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని అన్నారు. మానసిక దివ్యాంగుల హక్కులను కాపాడటం మన బాధ్యత అని తెలిపారు. వారిని హేళన చేయడం, పిచ్చి వారు అనడం, కొట్టడం లేదా కట్టివేయడం చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. దివ్యాంగుల సేవ దైవసేవ అని, ప్రతి ఒక్కరూ ప్రేమతో వారికి సహాయ సహకారాలు అందించాలని, వారికి అందరిలా అన్నీ హక్కులు ఉంటాయని పునరుద్ఘాటించారు. హన్మకొండ జిల్లాలోని దివ్యాంగుల సంస్థలన్నీ ఒక వేదిక మీదికి వచ్చి తమ సమస్యలు వివరిస్తే ఫలితాలు బాగుంటాయని సూచించారు. పిల్లలకు ఓర్పుతో విద్య నేర్పుతూ, మానసిక పరిపక్వత వచ్చేలా కృషి చేస్తున్న సంస్థలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిల్లల పాటలు, డ్యాన్సులు అందరిని అలరించాయి. అనంతరం వారికి బహుమతులు అందించారు, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రావు పద్మ, డాక్టర్ అనితా రెడ్డితో పాటు సంస్థ నిర్వాహకులు సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరాచారి ఆత్మహత్యాయత్నం బాధాకరం

## తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాదులో బీసీ రిజర్వేషన్ల కోసం ఈశ్వరాచారి ఆత్మహత్యకు పాల్పడడం అత్యంత బాధాకరమని, పోరాటాల ద్వారానే బీసీ రిజర్వేషన్లను సాధించుకోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శ్రీకాంత్ చారి ప్రాణత్యాగం చేసిన విధంగా, బీసీ రిజర్వేషన్స్ కోసం ఈశ్వర చారి ఆత్మహత్యకు పూనుకోవడం దురదృష్టకరమని అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాలలో, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి బీసీలకు ద్రోహం చేశారన్నారు. 9వ షెడ్యూల్లో చేర్చకుండా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బీసీలను దగా చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో బీసీలకు తీరని నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం కేవలం 17 శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహిస్తుండడం బీసీలలో నిరాశ, నిస్పృహలకు గురిచేసిందని తెలిపారు. బీసీలు ఐక్య పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోకుండా దగా చేస్తున్నందునే ఈశ్వరాచారి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ప్రాణ త్యాగానికి సిద్ధపడటం ఆవేదన కలిగిస్తున్నదన్నారు. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఈశ్వరాచారికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఆయన ప్రాణానికి ముప్పు వాటిల్లితే అది ప్రభుత్వ హత్యగానే భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ల అమలుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, లేనిచో రాష్ట్రం అగ్నిగుండంగా మారితే అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకట్రాములు తీవ్రంగా హెచ్చరించారు.



# తెలంగాణలో టీడీపీకి ఆదరణ ఉంది

## ◆ సర్పంచ్ అభ్యర్థి లచ్చు నాయక్

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో అభిమానం ఏ మాత్రం కొదవలేదని, ఆ అభిమానం తమ గెలుపునకు తోడ్పడుతుందని ఆ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఆంగోతు లచ్చు నాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సిరియల్ మండలంలోని మన్నెగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఎన్టీఆర్ తోపాటు చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి అనేక సంస్కరణలు చేపట్టారని లచ్చు నాయక్ గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అభివృద్ధికి, ప్రతి జిల్లా కేంద్రాల అభివృద్ధికి వారు చేసిన కృషి ఎనలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ, టీడీపీ పట్ల ఎనలేని అభిమానం చూపేవారు ఈ ప్రాంతంలో ఉన్నారని తెలిపారు. సిరియల్ మండలంలోని మన్నెగూడెంలో సైతం అనేకమంది టీడీపీ అభిమానులు ఉన్నారని, వారి ప్రోత్సాహం మేరకే తాను సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని వివరించారు. గ్రామ సమస్యల పైన పోరాడి, అభివృద్ధికి పాటుపడతానని, ప్రజలు తనను ఆదరించి అత్యధిక మెజారిటీతో తప్పక గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తేజావారి సత్యవతి, తేజావత్ రమేష్, తేజావత్ వెంకన్న పాల్గొన్నారు.



# యోగ టీచర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పార్ట్ టైమ్ యోగ టీచర్ లేదా స్పోర్ట్స్ కోచ్ గా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు బండి నర్సింహారావు తెలిపారు. పార్ట్ టైమ్ యోగ టీచర్/ స్పోర్ట్స్ కోచ్ కు గౌరవేతనంగా నెలకు రూ.8,300 చెల్లించబడుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులు తమ అప్లికేషన్‌ను, విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలతో డిసెంబర్ 10, 2025 లోగా పాఠశాలలో అందజేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. మరిన్ని వివరాల కోసం సీనియర్ టీచర్ నల్ల అప్పిరెడ్డిని (సెల్ నెంబర్: 9440228225)లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# తోట సుధాకర్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సీనియర్ జర్నలిస్టు, ప్రజాపక్షం ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో ఇంఛార్జి తోట సుధాకర్ కి ప్రజాపక్షం దినపత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని బండ్లగూడ కేంద్ర కార్యాలయంలో పత్రిక 7వ వార్షికోత్సవం తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా తోట సుధాకర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, నగదు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి నవచేతన విజ్ఞాన సమితి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, నవచేతన కార్యదర్శి బి.మోహన్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, జీఎం మదన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసోసియేట్ ఎడిటర్ బీ.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా విజయోత్సవాలా లేక కక్ష సాధింపు విజయోత్సవాలా?'

## ◆ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ

**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలన కాదు, రాక్షస పాలన అని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలు స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసమే ఆడుతున్న డ్రామాలు అని ఆయన మండిపడ్డారు. నర్సంపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో, శుక్రవారం ఉదయం ఆరు గంటలకు శాయంపేట మండల కేంద్రంలోని మందారపేట గ్రామానికి చెందిన కొమ్ముల శివను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి శాయంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి, యువజన నాయకులను అరెస్టులు చేయడం సరైనది కాదని, ఇది రాష్ట్రంలో తుగ్లక్ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. "ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా జిల్లా పర్యటనలు ఎలా చేస్తారు? మంత్రులు, ఎమ్మెల్యేలు దీనికి సమాధానం చెప్పాలి. ఎలక్షన్ కోడ్ మీకు వర్తించదా?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ అభివృద్ధి ఆగిపోయిందని, గతంలో కేసీఆర్ గారి హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రభాగన నిలిచిందని, ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవని గుర్తు చేశారు. "ఖబర్దార్ రేవంత్ రెడ్డి! రాబోయే కాలంలో ప్రజల చేతిలో మీకు గుణపాఠం తప్పదు. రాబోయే మూడేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ పతనం ఖాయం" అని శివ హెచ్చరించారు.



# విద్యార్థుల అక్రమ నిర్బంధం సరికాదు

## వారిని తక్షణమే విడుదల చేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత నెలలో మారేడుమిల్లిలో జరిగిన "ఎన్‌కౌంటర్"పై నిజనిర్ధారణ (ఫ్యాక్ట్ ఫైండింగ్) కోసం వెళ్లిన ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థుల బృందాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని మానవ హక్కుల వేదిక తీవ్రంగా ఖండించింది. నిర్బంధించిన విద్యార్థులను తక్షణమే, బేషరతుగా విడుదల చేయాలని హెచ్ఆర్ఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో విశ్వవిద్యాలయ విద్యార్థుల బృందం నిజనిర్ధారణ కోసం మారేడుమిల్లికి వెళ్లగా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు వారిని అడ్డగించారు. మొత్తం 12 మంది విద్యార్థులు, జీప్ డ్రైవర్, వారికి సహాయంగా వచ్చిన ఒక ఆదివాసీ యువకుడు సహా 14 మందిని ఎటువంటి చట్టబద్ధ కారణం లేకుండా నిర్బంధించారు. నిర్బంధించిన వారిని అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి బంధించారు. మానవ హక్కుల వేదిక ఈ నిర్బంధంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఇది వారి రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాయడమే అని పేర్కొంది. ఈ మేరకు, హెచ్ఆర్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ.జగన్నాథరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు.

# కేసీఆర్ కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

## బీఆర్ఎస్‌కు ఓటు వేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

### రాయల వెంకటేశ్వర రావు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని డోర్నకల్ మండలం చిల్కోడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి రాయల వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. శుక్రవారం చిల్కోడ గ్రామ బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిగా ఆయన భారీ ర్యాలీ నడుమ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలన అనంతరం ప్రజలను మోసం చేసి అధికారం అందుకున్న కాంగ్రెస్ పాలన గురించి ప్రజలకు అంతా తెలుసని అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ గారిని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నమ్మించి వమ్ముచేసిన కాంగ్రెస్ పార్టీకి సరైన గుణపాఠం చెప్పాలంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అధిక మెజారిటీతో గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గ్రామ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపిస్తే, నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం శాయంపేట మండలం మైలారం గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థితో పెద్దకోడపాక కేంద్రంలో ఆయన నామినేషన్ వేయించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే, ప్రజా ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తాము నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలలో కూడా మండలానికి అధిక ప్రాధాన్యత నిచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చల్లా చక్రపాణి, మామిడిపల్లి సాంబయ్య, డీటీ.రెడ్డి, అరికెల్ల సుధాకర్, ఏనుగుల శిరీష, అశోక్, కుమారస్వామి, రవీందర్, సదయ్య, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు సర్పంచ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పాపని రూపా దేవి రవీందర్ నామినేషన్




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ఆత్మకూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరపున పాపని రూపా దేవి రవీందర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియలో విశేషంగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆమెకు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు వంగల సమ్మిరెడ్డి, బుచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ పలకల మంజులతో సహా రెండు పార్టీల నాయకులు కలసి పాపని రూపా దేవి రవీందర్‌కు అండగా నిలబడ్డారు. ఈ సందర్భంగా పాపని రూపా దేవి రవీందర్ మాట్లాడుతూ తమకు సంఘీభావం తెలిపి, మద్దతుగా నిలిచిన రెండు పార్టీల నాయకులకు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యాలతోనే ఈ ఎన్నికల్లో పాల్గొంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, నాయకుల మద్దతుతో ప్రజా సేవలో మరింత చురుకుగా పనిచేస్తానని రూపా దేవి రవీందర్ హామీ ఇచ్చారు.

# మహిళల సౌకర్యాల విస్తరణకు ప్రైవేట్ బిల్లులు

## లోక్‌సభలో చరిత్ర సృష్టించిన ఎంపీ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మహిళల రక్షణ, సౌకర్యాలు, సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో రెండు కీలకమైన ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, మూడు దశాబ్దాల అనంతరం రాష్ట్రం నుంచి ఒక మహిళా ఎంపీ ఇలాంటి ప్రత్యేక బిల్లులను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఉద్యోగ రంగంలో నెలసరి సమయంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు – అందుబాటు గదులు, శుభ్రమైన రెస్ట్‌రూములు, తగిన ఆరోగ్య వసతులు – కల్పించేందుకు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి చేయాలని డా. కావ్య మొదటి బిల్లులో ప్రతిపాదించారు. మహిళల ఆరోగ్యం, ఉద్యోగ ఉత్పాదకత, భద్రత దృష్ట్యా ఈ చర్య అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, ఆపన్నస్థితిలో ఉన్న స్త్రీలకు ప్రభుత్వం ద్వారా అత్యవసర సహాయం, ఆధార వేతనాలు, గృహ భద్రత, సామాజిక సంక్షేమ చర్యలు తక్షణం అందేలా ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని రెండో ప్రైవేట్ బిల్లులో కోరారు. ఈ రెండు బిల్లులను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించడం మహిళా సాధికారత దిశగా మరొక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. వరంగల్ ఎంపీ ప్రవేశపెట్టిన ఈ బిల్లులు దేశవ్యాప్తంగా మహిళా సంక్షేమానికి మార్గదర్శకంగా ఉండనున్నాయని మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని జిల్లా వేర్ హౌజ్ గోదాములలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను (ఈవీఎంలను) జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా కలెక్టర్ ఈ పరిశీలన జరిపారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములకు సంబంధించిన రికార్డులు, అక్కడ ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, అలాగే సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించిన వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఎన్నికల పర్యవేక్షకులు జగత్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాస్, శ్యామ్ సుందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీయే ఏకైక ప్రత్యామ్నాయం

◆ మరో మూడేళ్లలో బీజేపీదే అధికారం

◆ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై యర్ర రామన్న ఫైర్



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్రంలో బీజేపీయే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని, రాబోయే మూడేళ్లలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి, సీనియర్ నాయకులు యర్ర రామన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ 'దొందూ దొందే'నని, వాటి పాలనలో రాష్ట్ర ప్రజలు అపారంగా నష్టపోయారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా యర్ర రామన్న, రాష్ట్ర రాజకీయాలపై, పార్టీ భవిష్యత్తుపై తన అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేశారు. గత పన్నెండేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అధికారం కోసం తాత్కాలికంగా విమర్శించుకుంటున్నా, వారి పాలన పద్ధతులు, అవినీతి విధానాలు, కుటుంబ పాలన ఒకే మాదిరిగా ఉన్నాయని రామన్న ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పటి నుండి ఈ రెండు పార్టీలు కేవలం తమ స్వలాభం కోసమే పనిచేశాయని, అభివృద్ధి నామమాత్రం, యువతకు ఉద్యోగాలు లేవని, ప్రాజెక్టులలో అవినీతి తాండవించిందని విమర్శించారు. ఈ రెండు పార్టీల పట్ల ప్రజలకు తీవ్ర నిరాశ, అసంతృప్తి నెలకొందన్నారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు అభివృద్ధి, నిజాయితీ, జాతీయతను కోరుకుంటున్నారని, ఆ బలమైన ఎజెండాతో ముందుకు సాగుతున్న భారతీయ జనతా పార్టీ మాత్రమే రాష్ట్రంలో ఏకైక, నిజమైన ప్రత్యామ్నాయం అని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న మద్దతుతో పాటు, ముఖ్యంగా పరకాల నియోజకవర్గంలో పార్టీ బలం విపరీతంగా పెరిగిందని యర్ర రామన్న గణాంకాలతో వివరించారు. గత సాధారణ శాసనసభ ఎన్నికల్లో (రెండు సంవత్సరాల క్రితం), బీజేపీ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఇతర పార్టీల అభ్యర్థుల కంటే దాదాపు 40,000 ఓట్లు కూడగట్టుకుని ముందున్నారు. ఇది పరకాల ప్రజలకు బీజేపీ పట్ల ఉన్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ స్పష్టమైన ఆధిక్యం, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల అవిశ్రాంత కృషి ఫలితంగా, మరో మూడేళ్లలో వచ్చే సాధారణ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుండి బీజేపీ పార్టీ లక్ష ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధిని నమోదు చేస్తోందని, ఈ అభివృద్ధి గ్రామీణ స్థాయి వరకు చేరుతోందని రామన్న స్పష్టం చేశారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి', ఉజ్వల యోజన, 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి కేంద్ర పథకాలు గ్రామాలలో నివసించే ప్రతి సామాన్య పౌరుడికి అందుతున్నాయని, ఫలితంగా బీజేపీపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయఢంకా: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు గెలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలు జాతీయ భావజాలం, అభివృద్ధి ఎజెండా వైపే మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. 1992-93లోనే ఏబీవీపీ కార్యకర్తగా హిందుత్వ భావజాలం పట్ల ఆకర్షితులైన యర్ర రామన్న ప్రస్థానం సుదీర్ఘమైనది. ఆయన 25 ఏళ్ల అవిశ్రాంత రాజకీయ ప్రయాణంలో ఏనాడూ పార్టీ మారాలనే ఆలోచన చేయకుండా అంకితభావంతో పనిచేశారు. 2003లో పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు, బీజేవైఎం మండల కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్‌గా పనిచేశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా మారుతున్న ఈ కీలక సమయంలో ఏ ఒక్క కార్యకర్త కూడా అధైర్య పడకుండా, అత్యంత ఉత్సాహంగా, సమైక్యంగా కలిసి ఉమ్మడి లక్ష్యం దిశగా ముందుకు సాగి, పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

# సాయి ఆత్మహత్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

## బీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆత్మహత్యాయత్నం చేసుకున్న సాయి ఈశ్వరా చారి మరణానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు తగ్గిపోవడం, అలాగే ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్ల హామీ నెరవేరకపోగా, బీసీ రిజర్వేషన్లు మరింత తగ్గిపోవడంతో బలహీన వర్గాలలో, ముఖ్యంగా యువతలో ఆందోళన చెందుతున్నదనే విషయం సాయి ఆత్మహత్యతో రుజువైందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక్క రిజర్వేషన్ల విషయమే కాదు, బీసీల అభివృద్ధి, సంక్షేమం పట్ల కూడా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుతో బలహీన వర్గాలు ఆందోళన చెందుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 1200 మంది ఆత్మ బలిదానాలు చేసుకున్న సంఘటనలు మరువకముందే సాయి ఆత్మహత్య సంఘటన జరగటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బలహీన వర్గాలు తమ వెనుకబాటుతనంపై ప్రభుత్వాలపై ప్రజాస్వామ్యక పోరాటాలకు సిద్ధం కావాలి కానీ, ఆత్మహత్యలు లాంటి చర్యలకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకి అవకాశాలు కల్పించే విషయంలో ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకోవాలని డాక్టర్ శేషు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐనవోలు మండలం పరిధిలోని ఉడుతగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు జన్నపురెడ్డి దేవిక –నరోత్తం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డిలతో పాటు కార్యకర్తలు సుమారు 50 మంది నేడు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు ఎమ్మెల్యే నాగరాజు వారికి పూల మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత, కొత్త అనే విభేదాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, గ్రామ అభివృద్ధికి బలమైన నాయకత్వం అందించాలని ప్రజలను కోరారు. గ్రామాభివృద్ధి కోసం తమవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పాలనలో సంక్షేమం – అభివృద్ధి సమర్థవంతంగా అమలు అవుతున్నాయి అని ప్రజలకు వివరించారు. గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేష్ గౌడ్, జిల్లా జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గ్యాదరి భాస్కర్ మండల నాయకులు రాకేష్ రెడ్డి, మార్నేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచులు బరిగెల ఆరోగ్యం, వెంకటయ్య గ్రామ యూత్ అధ్యక్షుడు రాము, కుమార్, లక్ష్మయ్య, కిరణ్, సంపత్ తో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు కడియం శ్రీహరి స్వాగతం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలలో' భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం చెప్పారు. అనంతరం, సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.



## సైక్ సిద్ధార్థ నుంచి సాంగ్ విడుదల

శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్ధార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.

## అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో

'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడిరది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది.






## తేరే ఇష్క్ మే తెలుగు ట్రైలర్ విడుదల



కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే'. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను తెలుగులో అమరకావ్యం పేరుతో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంరaణా', 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.

## అఖండ 2కు ఓవర్సీస్ థియేటర్స్ డోర్స్ క్లోజ్

అఖండ 2 రిలీజ్ పై మద్రాస్ కోర్టులో వాదనలు ప్రారంభమయ్యాయి. ఒకవేళ తీర్పు 14 రీల్స్ కు అనుకూలంగా వచ్చినా కూడా అఖండ 2 రిలీజ్ కాకపోవచ్చు. విషయం ఏంటంటే అన్ని సమస్యలను పరిష్కరించుకుని, ఈ సాయంత్రం నాటికి సినిమాను విడుదలకు సిద్ధం చేసినా అది కేవలం ఇండియాలో మాత్రమే చేయగలరు. ఓవర్సీస్ లో అఖండ 2 కు కేటాయించిన థియేటర్స్ ను హాలీవుడ్ మూవీస్ కు కేటాయించారు.చాలా పరిమిత ప్రదేశాలలో కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్స్ తప్ప బిగ్గెస్ట్ చైన్ థియేటర్స్ ను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లకు ఈ వారం దొరకవు. ఇప్పటికే అఖండ 2కి కేటాయించిన చాలా షోలు 'జూటోపియా 2' మరియు 'వికెడ్: ఫర్ గుడ్' కేటాయించి బుకింగ్స్ కూడా స్టార్ట్ చేసాయి. ఇప్పుడు ఆ స్క్రీన్స్ లో కొన్ని షోస్ అయిన తిరిగి అఖండ 2 కు కేటాయించడం అనేది డిస్ట్రిబ్యూటర్స్ కు కష్టతరమైన పని అవుతుంది. అక్కడి డిస్ట్రిబ్యూటర్స్ సజావుగా విడుదల చేయాలనుకుంటే సినిమాను ఒక వారం వాయిదా వేయాలి. వారికీ అదే బెస్ట్ ఛాయిస్ గా కనిపిస్తోంది. ఒకేవేళ ఓవర్సీస్ ను కాదని ఇండియా వారీగా రిలీజ్ చేస్తారా అంటే అది అసలు జరగని పని. సో ఇప్పుడు మేకర్స్ కు ఉన్న బెస్ట్ డేట్ అంటే డిసెంబర్ 12. ఆ డేట్ మిస్ అయితే డిసెంబర్ 19 నుండి 'అవతార్: ఫైర్ అండ్ యాష్' థియేటర్లలోకి వస్తుంది. అప్పుడు అఖండ 2కి ఓవరీస్ లో తగిన స్క్రీన్‌లను పొందడం పంపిణీదారులకు కష్టమైన పని అవుతుంది.

## పుష్ప-2 విడుదలకు ఏడాది

- ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్
- విమల్ థియేటర్‌లో పుష్ప`2 టిక్కెట్ల రగడ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు.'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి, హృదయం నిండా కృతజ్ఞతతో ధన్యవాదాలు అంటూ అల్లు అర్జున్ రాసుకోచ్చాడు. ఇదిలావుంటే బాలానగర్ విమల్ థియేటర్‌లో పుష్ప 2 టికెట్ల రగడ కొనసాగింది. పుష్ప 2 రిలీజ్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా విమల్ థియేటర్‌లో పుష్ప 2 సినిమా వేశారు. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులకు టికెట్స్ అందలేదు దీంతో ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. టికెట్స్ లేకపోవడంతో ఆగ్రహంతో రెండు వర్గాలకు చెందిన ఫ్యాన్స్ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





# 12 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

- తక్షణమే రూ.25లక్షల నిధులు మంజూరు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతోనే ఏకగ్రీవాలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జనగామ జిల్లా పరిధిలో అత్యధిక ఏకగ్రీవాలు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే కావడం సంతోషంగా ఉందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులను కడియం శ్రీహరి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న 110గ్రామ పంచాయతీలకు 10గ్రామ పంచాయతీలు అలాగే రెండో విడతలో ఎన్నికలు జరగనున్న ధర్మసాగర్, వేలేరు మండలాలలో రెండు గ్రామ పంచాయితీలు మొత్తం 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. ధర్మసాగర్, వేలేరు మండలాలలో విత్ డ్రాకు రేపటి వరకు సమయం ఉన్నందున మరిన్ని ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందన్నారు. ఏకగ్రీవం అయిన గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులకు తక్షణమే రూ.25లక్షల ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.
గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు సర్పంచులను ఎన్నుకోవాలని సూచించారు. ఇంకా మూడు ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఏ రకమైన అభివృద్ధి జరగాలన్న కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు గెలుస్తే ప్రభుత్వం దగ్గరికి, ఎమ్మెల్యే దగ్గరకు రాలేరని దింతో గ్రామ అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. గ్రామాలు అభివృద్ధి బాట పట్టాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే అభివృద్ధి జరుగుతుంది అని అనుకుంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని తెలిపారు.
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, ఎక్కడా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. గడిచిన 2ఏళ్లలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణి వంటి అభివృద్ధి, సంక్షేమ పనులు జరుగుతున్నాయని తెలిపారు. దేవాదుల ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండో పంటకు కూడా సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. నిజాయితీతో కూడిన అభివృద్ధి, అవినీతి లేకుండా సంక్షేమ పథకాల అమలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, నియోజకవర్గ నాయకులు, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా, శిశు అభ్యున్నతికి.. కేంద్ర పథకాలు అత్యంత కీలకం

## □ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళల సాధికారత, బాలల సంక్షేమం, పోషణ, మహిళల రక్షణ సేవల అమలు రాష్ట్ర పురోగతికి కేంద్ర పథకాలు అత్యంత కీలకమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఈ అంశాలపై లోక్‌సభలో ఆమె అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సమాధానం ఇచ్చారు. బేటీ బచావో బేటీ పడావో, మహిళా శక్తి కేంద్రం, అంగన్‌వాడీ–పోషణ 2.0, వన్ స్టాప్ సెంటర్లు, 181 హెల్ప్‌లైన్ వంటి కార్యక్రమాల అమలును శాఖ నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో పథకంతో బాలికల విద్య, రక్షణ, నైపుణ్యాభివృద్ధిలో గణనీయ పురోగతి కనిపిస్తోందన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఈ పథకం అమలులో ఉందని పేర్కొన్నారు. 2022లో నిలిపివేసిన మహిళా శక్తి పథకానికి బదులుగా 'మిషన్ శక్తి' అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మహిళల భద్రత, రక్షణ, సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లా మహిళా అభివృద్ధి కేంద్రం అవగాహన కార్యక్రమాలు, పథకాల ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

అంగన్‌వాడీ–పోషణ 2.0 ద్వారా పిల్లల పోషణ, ప్రీ–స్కూల్ విద్య, మౌలిక సదుపాయాల పురోభివృద్ధి జరుగుతుందని మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. తెలంగాణలో 35,769 అంగన్‌వాడీ సెంటర్లు శిశువుల ఎదుగుదల పర్యవేక్షణ పరికరాలతో సిద్ధంగా ఉన్నాయని, దీంతో పోషకాహార లోపాలను సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోవడం సాధ్యమవుతోందని చెప్పారు. మీల్స్, టేక్ హోమ్ రేషన్ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వయోజన బాలికలకు జీవచక్ర విధానంలో పోషకాహారం అందుతున్నట్లు వివరించారు. మహిళలపై హింస నివారణలో వన్ స్టాప్ సెంటర్ల పాత్ర ముఖ్యమని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 వన్ స్టాప్ సెంటర్లు 2015 నుంచి 77,858 మహిళలకు వైద్య, చట్టపర, మానసిక సహాయం వంటి సేవలు అందించాయన్నారు. 181 మహిళా హెల్ప్‌లైన్ ఈఆర్ఎస్ఎస్–112తో అనుసంధానమై 76,444 కేసుల్లో స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఈ పథకాలు వరంగల్ సహా గ్రామీణ ప్రాంతాల్లో మరింత వేగంగా అమలు కావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం తగ్గడం, లింగ వివక్ష తగ్గించే దిశగా ఇవి మరింత ప్రభావవంతంగా పనిచేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.



# 7న పెరిక సభ

- వెబ్ సైట్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం (766/2014) అనుబంధ వరంగల్ జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 7న వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పెరిక కుల అధికారిక వెబ్ సైట్ ను మంత్రి ప్రారంభించనున్నారు. పెరిక కులస్తులు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను కూడా మంత్రి ప్రారంభిస్తారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సురేఖను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్, గౌరవ అధ్యక్షుడు మద్దా లింగయ్య, ముఖ్య సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య తదితరులు పాల్గొంటారు. ఈ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కీత విజయకుమార్, పెరిక ధాత్రి ఎడిటర్ బరుపటి సంపత్ కుమార్, పెరిక కుల నాయకులు అల్లం రాజేష్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెరిక కుల పెద్దలు వనపర్తి శ్రీనివాస్, వరంగల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బెడద వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్, అంకతి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు స్వాగతం పలికిన నాయిని, నాగరాజు





ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, బహిరంగ సభకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.
– వరంగల్ వాయిస్, హనుమకొండ

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com